ఓయూలో 20న జాబ్‌మేళా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో (మోడల్ కెరియర్ సెంటర్)లో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శుక్రవారం బ్యూరో డిప్యూటీ చీఫ్ టి. రాము ఒక ప్రకటనలో తెలిపారు. మిత్రా ఏజెన్సీస్ (మారుతీ సుజుకీ ఎరీనా)లో మెకానిక్స్, రిలేషన్‌షిప్ మేనేజర్, అడ్వైజర్, టెలీకాలర్ తదితర ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేళాకు హాజరయ్యేందుకు ఐటీఐ (డీజిల్ మెకానిక్), డిప్లొమా, డిగ్రీ, బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్)తో పాటు 18 ఏండ్లు నిండిన యువతీయువకులు అర్హులన్నారు. వివరాలకు 779988 4909 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఓయూలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు శుక్రవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొంపెల్లి నరేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు హాజరవుతారని చెప్పారు. అనంతరం నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీతో పాటు మొక్కలు నాటుతామని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ నేడు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16: సికింద్రాబాద్ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు నేడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ హాజరై పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీ అందజేత

నఫీజ్‌బేగంకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ ఫిబ్రవరి 16: మోకాలి శస్త్ర చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మహిళకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని గైదిన్‌బాగ్‌కు చెందిన నఫీజ్ బేగం మోకాలి నొప్పితో బాధ పడుతుంది. ఆపరేషన్ చేయించుకోవడానికి ఇబ్బందులు ఉండడంతో ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. మంజూరైన రూ.90 వేల ఎల్వోసీ పత్రాన్ని శుక్రవారం బాధితురాలికి తలసాని అందజేశారు. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ పాల్గొన్నారు.

కోటి కుంకుమార్చనకు హాజరుకావాలి..

ఈ నెల 20 నుంచి 24 వరకు సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దే వాలయంలో అమ్మవారికి కోటి పసుపు కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఈ పూజా కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ శుక్రవారం మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తదితరులు

చివరి శ్వాస వరకు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతా..

- పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు
- కాంగ్రెస్ పార్టీ ఎక్కువ కాలం పాలన సాగించలేదు
- మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 16 : చివరి శ్వాస వరకు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, తన రాజకీయ గురవైన పజ్జన్నతోనే ప్రయాణమని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. శుక్రవారం మెట్టుగూడలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, కొందరు గిట్టని వారు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సాధారణ పార్టీ కార్యకర్తగా ఉన్న తనకు కార్పొరేటర్‌గా అవకాశం కల్పించి గుర్తింపును ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్, పద్మారావు గౌడ్ అని ఆమె స్పష్టం చేశారు. కన్నతల్లిలాంటి బీఆర్ఎస్ పార్టీలోనే తుదిశ్వాస వరకు కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు పాలనను అందించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో వారిలోవారికే సఖ్యత లేదని, ఇక రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఎద్దేవా చేశారు. తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ పార్టీ నేతలు గత కొన్నిరోజులుగా తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, అయినా కూడా బీఆర్ఎస్ జెండాను విడేదిలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నిరోజులు గడుస్తున్నా వృద్ధులకు పెన్షన్ వేయలేదని, రైతుబంధు నిధుల్లో కోత పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. అటూ అసెంబ్లీలో, ఇటూ కౌన్సిల్‌లో బీఆర్ఎస్ పార్టీకి కావాల్సినంత మెజార్టీ ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ మెడలు వంచైన ఇచ్చిన హామీలన్ని అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోస్తామని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, ఎలాంటి సిద్ధాంతాలు లేనివారు పార్టీలు మారుతారని, మా లాంటి నికార్సయిన ఉద్యమకారులు పదవులు ఉన్నా.. లేకున్నా ఒకే పార్టీలో ఉంటారని ఆమె స్పష్టం చేశారు.

సూర్య భగవాన్ ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు పూజలు

సూర్య భగవాన్ ఆలయంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు

కంటోన్మెంట్/ బొల్లారం, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా సికింద్రాబాద్ తిరుమలగిరిలోని సూర్య భగవాన్ ఆలయంలో శుక్రవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు సూర్య భగవాన్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు అజయ్‌యాదవ్, టింకూగౌడ్, అరుణ్‌కుమార్‌లు సూర్య భగవాన్‌ను దర్శించుకున్నారు.

విద్యార్థుల్లో ఆలోచనావిధానం మారాలి

వర్క్‌షాప్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎరిక్ అజులె

అమీర్‌పేట్, ఫిబ్రవరి 16 : బేగంపేట్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఉద్యమిత 2.0– ఆఫ్ ద బీటెన్ ట్రాక్' పేరుతో అమెరికన్ కార్నర్ తోడ్పాటుతో ప్రారంభమైన రెండు రోజుల వర్క్‌షాప్ మొదటి రోజు ఉత్సాహంగా సాగింది. అమెరికాకు చెందిన నెక్సెస్ సంస్థకు చెందిన ఈడీ ఎరిక్ అజులె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ..విద్యార్థులు తమ ఆలోచనలను ఆలోచనా స్థాయి నుంచి ఆచరణ స్థాయికి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ సీఓఓ కవితా డేవిడ్, సామాజికవేత్త మేజర్ డాక్టర్ శివకిరణ్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఉమా జోసెఫ్ పాల్గొన్నారు.

ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీగా శంకర్రాజు బాధ్యతలు

బేగంపేట్, ఫిబ్రవరి 16: సికింద్రాబాద్ ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీగా శంకర్రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీగా ఉన్న శంకర్రాజు ఇటీవల జరిగిన బదిలీల్లో ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ ఉన్న మధుసూదన్ చౌటుప్పల్‌కు బదిలీపై వెళ్లారు. అనంతరం శంకర్రాజు మాట్లాడుతూ..ఉత్తర మండలం పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్రాజు

బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా రామయ్య ..

బేగంపేట్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ రామయ్య బాధ్యతలు స్వీకరించారు. మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బేగంపేట్ పోలీస్‌స్టేషన్ వచ్చారు. ఇప్పటి వరకు బేగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఉన్న భాస్కర్ మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రామయ్య

చిలకలగూడ సీఐగా అనుదీప్..

అడ్డగుట్ట, ఫిబ్రవరి 16 : చిలకలగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.అనుదీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట సర్కిల్‌లో సీఐగా బాధ్యతలను నిర్వర్తించిన అనుదీప్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మట్టంరాజు బదిలీపై సైబర్ క్రైమ్‌కు వెళ్లాడు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

సీఐగా బాధ్యతలను స్వీకరించిన అనుదీప్

ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా..



రైతులకు మద్దతుగా ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో పాటు దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అన్నింటినీ అమలు చేయాలని కోరారు. అప్పట్లో రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో ప్రవేశపెట్టిన అశాస్త్రీయమైన నూతన జాతీయ విద్యా విధానం – 2020ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు లెనిన్, బాలమ్మ, అశ్వన్, మధు, లక్ష్మమ్మ, యాదమ్మ, సరిత, మణెమ్మ పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

- కనీస వేతనాలు అమలు చేయాలి
- ఆందోళన కార్యక్రమంలో కార్మికుల డిమాండ్

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సికింద్రాబాద్/ అడ్డగుట/ ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: వివిధ కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో తార్నాక డివిజన్ లాలాపేటలోని విజయ డెయిరీ ఎదుట కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన వాహన చట్టాన్ని వెంటనే సవరించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. అధిక ధరలు తగ్గించాలని, కార్మిక హక్కులకు చట్టబద్ధత కల్పించాలన్నారు. దేశంలో విద్య, వైద్యం పూర్తిగా ఉచితంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అజయ్‌బాబు, బాలరాజు, అమిత్‌ఖాన్, కృపాకర్, అంజి, బాబుసేఠ్, మహేశ్, హరి, అభి, శంకరన్న తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మెకు మద్దతుగా..

ఎక్కడైనా పనిచేసిన కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత సమ్మెకు నాయకులు అడ్డగుట్టలో నిరసన తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అజయ్‌బాబు, ఎమ్. గోపాల్, లలితమ్మ, వసంత, రమాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం..

దేశవ్యాప్తంగా జరిగిన రవాణా బంద్ విజయవంతం అయ్యిందని ఆటో డ్రైవర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ ఉమర్ ఖాన్ అన్నారు.శుక్రవారం సీతాఫల్‌మండిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో, క్యాబ్,లారీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒక్క రోజు బంద్‌లో పాల్గొని నిరసన తెలిపామన్నారు. అనంతరం చిక్కడపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కే లతీఫ్, కొండల్, సాజన్, రంజిత్‌రెడ్డి, లక్ష్మణ్, ఆంజనేయులు, హరిదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నేడు తార్నాకలో ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: తార్నాకలోని సత్యోదయం రిట్రీట్ సెంటర్‌లో ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెల్విన్ బెనెడిక్ట్, కార్యదర్శి జేమ్స్ సిల్వస్టర్ తెలిపారు. క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా గుర్తించిన ఈ యూనియన్ దేశంలోని 16 మిలియన్ల క్యాథలిక్కులకు ప్రాతినిధ్యం వహిస్తోంది. 3రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో వివిధ అంశాలను చర్చించనున్నారు.

పూజారెడ్డికి అభినందనలు

విద్యార్థిని పూజా రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీసుధ,ఉపాధ్యాయ సిబ్బంది

బొల్లారం,ఫిబ్రవరి 16: నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు త్రివేణి పాఠశాల విద్యార్థి కే.పూజారెడ్డి సోల్యూషన్స్ టు మాన్ హోల్ యాక్సిడెంట్స్ ప్రాజెక్టు తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది.ఈ సందర్భంగా విద్యార్థి పూజారెడ్డిని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీసుధ, ఉపాధ్యాయులు సురేఖ,సీఆర్ఓ వెంకట్రావు అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసీ రాజీనామా చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: ఉస్మానియా యూనివర్సిటీ సెక్యూరిటీ విభాగం పూర్తిగా నిర్వీర్యమైందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అలివేలి రాజు అన్నారు. క్యాంపస్‌లో వి ద్యార్థులకు, వర్సిటీ ఆస్తులకు రక్షణ క ల్పించేందుకు బీ సెక్యూర్ సంస్థను ఏ ర్పాటు చేసుకుని లక్షలు ఖర్చు పెడుతున్నా ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందని ఆరోపించారు. విద్యార్థులకు రక్షణ కల్పించాలని పలుమార్లు ధర్నా చేసినా ఫలితం లేదని, తాజాగా ఆక్సిజన్ పార్కులో నడుస్తున్న తల్లీకూతుళ్లపై దాడి చేసి బంగారం చోరీ చేసినా ఓయూ ఉన్నతాధికారులు స్పందించలేదని అన్నారు. రక్షణ కల్పించలేని ఓయూ వీసీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఓయూ ఏసీపీకి శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన గ్యార జగన్‌ను శుక్రవారం యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

– ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 16

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 16 : సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. వెంటనే బస్తీ వాసులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో..విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అదుపులోకి తెచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం పడడంతో చెత్తతో నిండిపోయింది. శుక్రవారం ఉదయం ట్రాన్స్ ఫార్మర్ నుంచి ఆయిల్ కారడంతో విద్యుత్ మిరుగులు ఒక్కొక్కటిగా కిందకు పడడంతో అవి అంటుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించాయి. విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

52 మంది ఎంపిక

సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి బాస్కో సేవా ఆధ్వర్యంలోని దిశ సంస్థ నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. శుక్రవారం నిర్వహించిన మేళాలో వివిధ కార్పొరేటర్ సంస్థలు పలు దశల్లో జరిగిన ఇంటర్వ్యూల తరువాత 52 మంది ఎంపిక చేసినట్లు దిశ సంస్థ ప్రతినిధి ఐవనో వాజ్ తెలిపారు.

– అమీర్‌పేట్, ఫిబ్రవరి 16